రుణమాఫీ చేసిన ఘనత కేసీఆర్‌దే

• హుజూరాబాద్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్/వీణవంక: అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన వెంటనే చల్లూర్ గ్రామాన్ని మండలంగా చేస్తానని, దివంగత, మాజీ మంత్రి ముద్దసాని దామోదర్‌రెడ్డి ఆశయాలను కొనసాగిస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. వీణవంక మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, రుణమాఫీ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కౌశిక్‌రెడ్డి సతీమణి కొంగుపట్టి కోరారు. టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, ఏఎంసీ మాజీ చైర్మన్ వాల బాలకిషన్‌రావు, ఎంపీపీ రేణుకతిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు తిరుపతిరెడ్డి, సాదవరెడ్డి, మధుకర్‌రెడ్డి, శ్రీనివాస్, కాంతరెడ్డి, రవీందర్‌రావు, సార య్య, శ్రీనివాస్‌రావు, రాజేశ్వర్‌రావు, సతీశ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ఇంటింటా ప్రచారం

హుజూరాబాద్ పట్టణంలోని పలు వార్డుల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కౌశిక్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. వార్డు అధ్యక్షుడు సంజీవ్, మైనార్టీ విభాగం ఇమ్రాన్, సీనియర్ నాయకులు సంపత్, రవి, రాజయ్య, సజ్జు, తిరుపతి, ప్రకాశ్ పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్‌లో ప్రచారం చేస్తున్న కౌశిక్‌రెడ్డి

ఎస్సీవర్గీకరణతో మభ్యపెడుతోంది

ఎస్సీల ఓటు బ్యాంక్ కోసం బీజేపీ ఎస్సీ వర్గీకరణ తెరపైకి తీసుకొచ్చిందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని సిటీ సెంటర్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ఎందుకు పాస్ చేయలేదో ముందుగా ఎస్సీలకు తెలపాలన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో 120 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయటం, సెక్రటేరియట్‌కు అంబేద్కర్ పేరు పెట్టి దళితుల ఆత్మగౌరవం పెంచారన్నారు. ఎన్ని కుట్రలు చేసినా మూడోసారి సీఎం కాబోయేది కేసీఆరేనని అన్నారు. విలేకరుల సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండల్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ తులసి లక్ష్మణమూర్తి, రాష్ట్ర నాయకులు వర్దినేని రవీందర్‌రావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మొలుగూరి ప్రభాకర్, నాయకులు సమ్మయ్య, శ్రీధర్ గౌడ్, సదానందంగౌడ్, సారయ్య గౌడ్, శ్రీకాంత్ గౌడ్, లింగం రాజు పాల్గొన్నారు.



కాట్రపల్లిలో నాయకుల ప్రచారం

కాట్రపల్లిలో...

హుజూరాబాద్‌రూరల్ మండలంలోని కాట్రపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి కౌశిక్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తొగరు బిక్షపతి, కాసగొని కిరణ్, రావుల వెంకట్, నియోజకవర్గ యూత్ ఇంచార్జీ తొగరు శివకృష్ణ, మైస సుధాకర్ ఉన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటే

• కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ

గన్నేరువరం/తిమ్మాపూర్: బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటేనని, ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం కేసీఆర్ ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చి మరిచారని కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలో గుంటి వేణు అధ్యక్షతన మానకొండూర్ నియోజకవర్గ సీపీఐ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవేని శంకర్‌తోపాటు కవ్వంపల్లి కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఐదు రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ రక్షణ కోసం రాష్ట్రంలో కేసీఆర్ నియంత పాలన అంతం కోసం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని శంకర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, మండల కార్యదర్శి తిరుపతి, నాయకులు పవన్, కేదారి, అశోక్, వెంకట్ రెడ్డి, సమ్మయ్య, అంజిరెడ్డి, యుగేందర్, మహేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సుస్థిరపాలన సాధ్యం

కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణకు మద్దతుగా నాయకులు గన్నేరువరంలో మంగళవారం గడప గడపకు ప్రచారం చేశారు. ఈ కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన సాధ్యమని, బీఆర్‌ఎస్, బీజేపీలను నమ్మొద్దన్నారు. రుణమాఫీ, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితబంధు పథకాల అమల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్కూరి అనంతరెడ్డి, జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మాతంగి అనిల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొలుపుల రవీందర్, కిసాన్ సెల్ అధ్యక్షుడు నల్లా చంద్రారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, కవ్వంపల్లి రాజయ్య, జీల ఎల్లయ్య, బుర్ర మల్లేశం, మీసం రాములు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కమీషన్ల పార్టీ

తంగళ్లపల్లి: బీఆర్‌ఎస్ కమీషన్ల పార్టీ అని రాయచూర్ ఎమ్మెల్యే బసవా గౌడ ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలు చేస్తామన్నారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కవ్వంపల్లి సత్యనారయణ సతీమణి డాక్టర్ అనురాధ ఆధ్వర్యంలో మోడల్ బ్యాలెట్ చూపిస్తూ హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీపీ ఐలయ్య, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తిమ్మాపూర్: కొత్తపల్లిలో మాట్లాడుతున్న కవ్వంపల్లి సత్యనారాయణ



తంగళ్లపల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బసవాగౌడ

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

హుజూరాబాద్‌రూరల్ : ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ బొల్లం రమేశ్ అన్నారు. సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల పరిశీలనలో భాగంగా మంగళవారం మండలంలోని పోతిరెడ్డిపేట, వెంకట్రామ్‌పల్లె గ్రామాల్లో కేంద్ర బలగాలతో ప్రత్యేక కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. గత ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడిన వ్యక్తులకు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై నిఘా పెట్టామని, వారిని బైండోవర్ సైతం చేసినట్లు తెలిపారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రంపరిశీలన

మండలంలోని సింగాపూర్‌లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం ఏసీపీ జీవన్‌రెడ్డి పరిశీలించారు. ఎన్నికల నియామవళిని ప్రజలందరూ పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు.



పోతిరెడ్డిపేటలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న సీఐ బొల్లం రమేశ్

ఓర్వలేక కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం

• కాంగ్రెస్ అభ్యర్థి వొడితెల ప్రణవ్

హుజూరాబాద్/హుజూరాబాద్‌రూరల్/జమ్మికుంట/ఇల్లందకుంట: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ సాధ్యమవుతుందని, ఆదరణ ఓర్వలేక పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని హుజూరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి వొడితెల ప్రణవ్ అన్నారు. హుజూరాబాద్ పట్టణం, వివిధ గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ మాట ఇస్తే తప్పదని హామీలన్నీ అమలు చేస్తామని, పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నాలుగువందలకే గ్యాస్ సిలిండర్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోయింది, అధికారంలోకి రాగానే ఖాళీగా రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలుచేస్తామని వొడితెల ప్రణవ్ అన్నారు. జమ్మికుంట మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ 80 సీట్లు గెలుస్తుందని సర్వేలు చెబుతున్నాయని, ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సమ్మిరెడ్డి, వెంకన్న,పూదరి రేణుకశివకుమార్‌గౌడ్, సుంకరి రమేష్, ఎగ్గని శ్రీనివాస్, పుల్లూరి సదానందం, సారంగపాణి, పాపిరెడ్డి పాల్గొన్నారు. ఇల్లందకుంట మండల కేంద్రంతో పాటు వంతడుప్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు కోడం రజిత ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ ఆరు గ్యారంటీ లను వివరిస్తూ వొడితెల ప్రణవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



ప్రచారంలో మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్

అరకొర వసతులు.. అవస్థలు

- అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు
- చిన్నారులు, టీచర్లకు తప్పని తిప్పలు
- శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రజల డిమాండ్
- ఆయాలు లేకపోవడంతో పిల్లలను కేంద్రాలకు పంపని వైనం

మానకొండూర్‌రూరల్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పుష్టికరమైన, సమతుల్య ఆహారం అందించి ఆరోగ్యంగా జీవించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసంధానంతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కొనసాగుతోంది. కానీ కేంద్రాలకు శాశ్వత భవనాలు లేక అద్దె భవనాల్లో అరకొర వసతులతో కొనసాగుతున్నాయి. దీంతో చిన్నారులు, అంగన్‌వాడీ టీచర్లు ఇబ్బందులుపడుతున్నారు.

- మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లోని అంగన్‌వాడీ సెంటర్లను మానకొండూర్, చెంజర్లను కలిపి రెండు క్లస్టర్లుగా విభజించారు.
- మండలంలో 50 అంగన్‌వాడీ సెంటర్లలో 48 అంగన్‌వాడీ టీచర్లు, 40 మంది ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు.
- 50 కేంద్రాల్లో 33 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. 5 కేంద్రాలు అద్దె భవనాల్లో, 12 కేంద్రాలను అద్దెలేని భవనాల్లో నిర్వహిస్తున్నారు.
- శాశ్వత భవనాలు లేక పోవడంతో అన్నారం-2, మానకొండూర్-1, 3, వెల్ది-1, లింగాపూర్-1, గొల్లపల్లి, జగ్గయ్యపల్లి, ముంజంపల్లి, గంగిపల్లి-2, 3, గట్టుదుద్దెనపల్లి-2, ఖాదర్‌గూడెం, కొండపల్కల-1, రంగపేట, శంషాబాద్, ఊటూర్-2, 3 సెంటర్లలో అరకొర వసతుల మధ్య ఆటపాటలు, విద్య కొనసాగుతోంది.
- బంజేరుపల్లి, లింగాపూర్-2 కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లు, సదాశివపల్లి, మానకొండూర్-2, 3, దేవంపల్లి-2, పచ్చునూర్-1, గట్టుదెదుద్దెనపల్లి-2, ఊటూర్-2, కొండపల్కల-3, ఖాదర్‌గూడెం, రంగపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలు లేకపోవడంతో చిన్న పిల్లలు సెంటర్‌లకు రావడం లేదు.
- పిల్లలను చూసుకోవడానికి ఆయాలు లేకపోవడంతో తల్లిదండ్రులు పిల్లలను కేంద్రానికి పంపడానికి విముఖత చూపిస్తున్నారు.
- ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలపై దృష్టి కేంద్రీకరించి శాశ్వత భవన నిర్మాణాలకు కృషి చేయాలని, ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టులను భర్తీ చేయాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



అన్నారంలో అద్దెఇంట్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

శాశ్వత భవనం లేదు



శాశ్వత భవనం లేకపోవడంతో అరకొర వసతులతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. కనీస సౌకర్యాలు లేకపోవడం, తరచుగా ఇళ్లు మారడంతో పిల్లలు, తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తక్షణం అధికారులు, నాయకులు శాశ్వత భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. – ఆరెల్లి అరుణప్రభంజన్, అన్నారం

టీచర్‌ను నియమించాలి



గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ పోస్టును నాలుగేళ్లుగా భర్తీ చేయడం లేదు. ఇప్పటివరకు టీచర్ లేకపోవడంతో పిల్లలు ఆటపాటలు, చదువుకు దూరం అవుతున్నారు. టీచర్‌ను నియమిస్తే తల్లిదండ్రులు చిన్నపిల్లలను సెంటర్‌కు పంపిస్తారు. ఆ దిశగా అధికారులు, నాయకులు చర్యలు చేపట్టాలి. – ఎస్. సందీప్‌గౌడ్, లింగాపూర్

విముఖత చూపుతున్నారు



చిన్నారుల ఆలన, పాలన చూసుకోవడానికి కేంద్రాల్లో ఆయాలు తప్పనిసరిగా ఉండాలి. ఆయాలు లేకపోవడంతో తల్లిదండ్రులు పిల్లలను కేంద్రానికి పంపడానికి విముఖత చూపిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులను భర్తీ చేయాలి. – బోద శేఖర్, వార్డుమెంబర్, మానకొండూర్

కాంగ్రెస్‌తోనే దొరల పాలన అంతం



ముత్తారంలో కాంగ్రెస్ విజయభేరి ప్రచారంలో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్‌గౌడ్



ఎర్రబెల్లిలో దప్పు కొడుతున్న పొన్నం ప్రభాకర్

- కేసీఆర్ తిన్న ప్రజాసొమ్మును కక్కిస్తాం
- అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు
- హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్

వేలేరు: కాంగ్రెస్ పార్టీ గెలిస్తేనే రాష్ట్రంలో కొనసాగుతున్న దొరల పాలన అంతమవుతందని మాజీ ఎంపీ, హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎంతమందికి డబుల్‌బెడ్రూం ఇళ్లు, దళితబంధు, నిరుద్యోగ భృతి, మూడెకరాల భూమి, రేషన్ కార్డులు, బీసీబంధు ఇచ్చారో చెప్పాలన్నారు. తనను గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే గ్రామాల రూపురేఖలు మారుస్తానని స్పష్టం చేశారు.

అసెంబ్లీకి పంపించండి

ఎల్కతుర్తి : తనకు ఓట్లు వేసి అసెంబ్లీకి పంపించాలని, హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. భీమదేవపల్లి మండలంలోని ఎర్రబెల్లి, ముత్తారం, కొత్తపల్లి, ముల్కనూర్, భీమదేవరపల్లి గ్రామాల్లో మంగళవారం కాంగ్రెస్ విజయభేరి ప్రచారం నిర్వహించారు.

ఆరు గ్యారంటీల అమలు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కర్ణాటక తరహాలో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని కర్ణాటక యూత్ ఎంపవర్మెంట్, స్పోర్ట్స్ అండ్ ఎస్టీ వెల్ఫేర్ మంత్రి నరేంద్ర అన్నారు. మంగళవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పొన్నం ప్రభాకర్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాడన్నారు. ఆయన వెంట ఏఐసీసీ సెక్రటరీ కిస్టోఫర్ తిలక్, అసెంబ్లీ ఇన్‌చార్జి గోపీనాథ్ పళని అప్పన్, పీసీసీ మెంబర్ బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చిట్టంపల్లి ఐలయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు పాల్గొన్నారు.



ప్రమాదకరంగా రోడ్డు.. మరమ్మతు మరిచారు

రామడుగు: మండలంలోని వెదిర గ్రామం నుంచి వెలిచాల గ్రామనికి వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారింది. వానాకాలంలో కురిసిన భారీ వర్షాలకు రోడ్డు మధ్యలో గండి పడింది. దీంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణం స్పందించి మరమ్మతు చేయాలని వెదిర, వెలిచాల గ్రామ ప్రజలు కోరుతున్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

ప్రపంచ మత్స్య దినోత్సవం

కరీంనగర్‌సిటీ: నగరంలోని ఎస్సారార్ ప్రభుత్వ కళాశాలలో మంగళవారం జంతుశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ భారతదేశానికి అత్యంత పొడవైన సముద్రతీర రేఖ, విశాలమైన సముద్ర జలాలు ఉన్నాయన్నారు. దేశంలో అనేక జీవనదులు, చెరువులు, రిజర్వాయర్లు, కుంటలు ఉండి మత్స్య సంవర్ధనానికి అనుకూలంగా ఉండి అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జంతుశాస్త్ర శాఖ అధిపతి లెఫ్టినెంట్ పి. రాజు, అధ్యాపకులు డాక్టర్ సురేందర్ రెడ్డి, డాక్టర్ టి.మహేశ్, బి.సురేశ్‌కుమార్, సమత, సుమలత, రవళి, కృష్ణ, ఫిషరీస్ విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలో పోలీసుల కవాతు

కరీంనగర్‌క్రైం: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకునే ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా కరీంనగర్‌లోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు వీధుల్లో మంగళవారం పోలీసులు స్పెషల్ యాక్షన్ టీంల ఆధ్వర్యంలో ఫూట్ మార్చ్, వాహన తనిఖీలు చేపట్టారు. మంగళవారం ఓల్డ్ లేబర్ అడ్డా, న్యూ లేబర్ అడ్డా, విద్యానగర్, రాంనగర్, చైతన్యపురి, భాగ్యనగర్ వీధుల్లో పర్యటించారు. కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసీపీలు నరేందర్, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, టూటౌన్ సీఐ రాంచందర్‌రావు, హెడ్‌క్వార్టర్ నుంచి స్పెషల్ యాక్షన్ టీంలు, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైభవంగా వార్షికోత్సవ పూజలు

కరీంనగర్ కల్చరల్: నగరంలోని కట్టరాంపూర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న తృతీయ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం మంటపారాధనలు, పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమాల్లో ఈవో నాగారపు శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు. కాగా బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి సీతారామచంద్రస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

